క్లుప్తంగా

ప్రతి మహిళా సంఘానికి రుణాలు



బిచ్కుంద(జుక్కల్): పాత, కొత్త మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రవీందర్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. స్త్రీనిధి ప్రమాద బీమా, మహిళా యూనిఫాం, జీవనోపాధి, లింకేజీ రుణాలు, బతుకమ్మ సంబురాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బీమాలతో జరిగే ప్రయోజనం, అందే ఆర్థిక సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

మద్యం విక్రయాలు నిషేధం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో మద్యం విక్రయాలను నిషేధిస్తూ మంగళవారం గ్రామస్తులు తీర్మానం చేశారు. గ్రామంలో ఎవరూ మద్యం విక్రయాలు చేపట్ట రాదన్నారు. కిరాణ దుకాణాలు, హోటళ్లలో మద్యం విక్రయాలు చేపట్టినట్లయితే రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని గ్రామస్తులు తీర్మానించారు. ఈ మేరకు తీర్మాన పత్రాలను మండల అధికారులు, పోలీసులకు అందజేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు బిల్లులు



బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు వెనువెంటనే బిల్లుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు హన్మాజీపేట్ పంచాయతీ కార్యదర్శి రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన గ్రామ పంచాయతీ పరిధిలో బేస్‌మెంట్ వరకు ఇంటి నిర్మాణం పూర్తయిన లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి యాప్‌లో కొలతలు నమోదు చేశారు. లబ్ధిదారుల అకౌంట్‌లో తొలివిడతగా రూ.లక్ష జమవుతాయన్నారు. ఆయన వెంట కారోబార్ దత్తు ఉన్నారు.

పంట పొలాల పరిశీలన



నస్రుల్లాబాద్: మండల కేంద్రం శివారులో వరి పంటను మంగళవారం బాన్సువాడ ఏడీఏ అరుణ పరిశీలించారు. వరి పైరుకు ఎండాకు తెగులు వ్యాపించిందని ఆమె గుర్తించి రైతులకు సూచనలు చేశారు. నివారణకు ప్లాంటోమైసిన్ 0.2గ్రా+కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతుల అధైర్య పడవద్దని క్రిమి సంహారక మందులు స్ప్రే చేస్తే పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఏఈవో గోపాల్, రైతులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


రోహన్


ఆనంద్

రామారెడ్డి: జనగామ జిల్లాలో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన రాష్ట్ర సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల ఫలితాలు మంగళవారం వెలువడినట్లు ఉప్పల్‌వాయి గురుకుల ప్రిన్స్‌పాల్ శివరాం తెలిపారు. ఈ పోటీలలో ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రోహన్ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ లింగం తెలిపారు. జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 25 నుంచి తమిళనాడులో జరుగనున్నట్లుగా వెల్లడించారు. అలాగే ఈ నెల 22న కామారెడ్డి జిల్లాలోని శిశుమందిర్ పాఠశాలలో జరిగిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థి ఆనంద్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పోటీలు నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో జరగనున్నాయి. ఎంపికై న వారిని ప్రిన్సిపాల్ శివరాం అభినందించారు.

మసకబారుతున్న కంటి చూపు

- కళ్ల వెంట నీళ్లు.. కనిపించిన బోర్డులు
- ఆర్‌బీఎస్‌కే పరీక్షల్లో వెలుగుచూస్తున్న వైనం
- 3,580 మందికి కంటి అద్దాల పంపిణీ
- 154 మంది విద్యార్థులకు ఆపరేషన్ కోసం సిఫారసు
- పోషకాహార లోపం, సెల్‌ఫోన్ ప్రభావమే కారణం


పంపిణీ చేసిన కంటి అద్దాలతో విద్యార్థులు, వైద్యులు, ఉపాధ్యాయులు (ఫైల్)

బిచ్కుంద(జుక్కల్) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నారని గుర్తించి ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ద్వారా పాఠశాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. పిల్లల్లో దృష్టిలోపాలున్నట్లు వైద్యుల పరీక్షల్లో వెలుగుచూస్తున్నాయి. కళ్ల నుంచి నీరు కారటం, మంటలు, తలనొప్పి, మసక మసకగా కనిపించడం, తదితర కంటి సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీనికి కారణం పోషకాహారం లోపం, గంటల తరబడి సెల్‌ఫోన్లు, టీవీలు చూడడం. కామారెడ్డి జిల్లాలో గత ఏడాది వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలు మధ్య తరగతి, పేదవర్గాలు కావడంతో ప్రైవేటు వైద్యం చేయించుకోలేకపోతున్నారు. కంటి సమస్యలతో చదువులో వెనకబడుతూ పిల్లలు ఉజ్వల భవిష్యత్తును కోల్పోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు వాపోతున్నారు.

ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ..

చిన్నారుల దృష్టి లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సను అందించాలనే మంచి లక్ష్యంతో ప్రభుత్వం ఆర్‌బీఎస్‌కే ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో కంటి వైద్య నిపుణులతో వైద్య పరీక్షలకు శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు భవిష్యత్తులో కంటి సమస్యలు ఎదురు కావద్దని వైద్య బృందాలతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో 69,017 మంది విద్యార్థులకు కంటి, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 3,580 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్ కోసం 154 మందిని ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి పాఠశాలను సందర్శించి అవసరమైన వారికి మందులు అందిస్తోంది. జిల్లా కలెక్టర్ స్పందించి దృష్టిలోపం ఉన్నవారికి ప్రత్యేకంగా అధిక విటమిన్స్ ఆహారం, సప్లిమెంట్స్ అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దూరంగా ఉన్నవి కనపడటం లేదు



గత రెండేళ్ల నుంచి కంటి అద్దాలు పెడుతున్నాను దూరం చూపు కనబడడం లేదు మసక మసకగా ఉంటుంది. అద్దాలు లేకుంటే బోర్డు పై ఉన్న అక్షరాలు కనబడవు. ప్రభుత్వం మాపై ప్రత్యేక దృష్టి పెట్టి కంటి సమస్యలు రాకుండా పోషక విలువలు ఉన్న ఆహారం అందించాలని కోరుతున్నాము. – వినాయక్, పదవ తరగతి, జ్యోతీబాపూలే స్కూల్, బిచ్కుంద

అద్దాలు లేకుండా చదవలేకపోతున్నాం



కంటి నుంచి నీరు కారటం, తలనొప్పి ఉంటుంది. అక్షరాలు కనపడటం లేదు. వైద్యులు పరీక్షించి అద్దాలు పెట్టుకోవాలని సూచించారు. అద్దాలు లేకుండా చదవలేకపోతున్నాం. అద్దాలు విరిగిపోయాయి. దారంతో కట్టుకున్నాను. అద్దాలు ఇవ్వాలని కోరుతున్నాం. – హన్మంత్, 9వ తరగతి, జ్యోతీబాపూలే స్కూల్, బిచ్కుంద

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


కొండాపూర్ తండాలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి): భారీ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని లింగంపేట వైద్య సిబ్బంది అన్నారు. మంగళవారం కొండాపూర్ తండాలో ఇంటింటికి వెళ్లి గిరిజనులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. దోమల లార్వా, ఉత్పత్తి స్థావరాలపై మందులు పిచికారీ చేయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రాంబాయి, వైద్య సిబ్బంది గోవిందొరెడ్డి, ఠాగూర్, ఆరోగ్య కార్యకర్త జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏఎన్ఎం సబేరా బేగం అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం ఆరోగ్య సిబ్బంది పర్యటించారు. ఇళ్లలోకి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆశ వర్కర్లు జ్యోతి, స్వప్న, సుజాత, హంస పాల్గొన్నారు.

చెరువుకు గండి కొట్టిన ఘటనపై విచారణ

- సీసీ కెమెరా పుటేజీల పరిశీలన

భిక్కనూరు: మండల కేంద్రంలోని దాసనమ్మ కుంట చెరువు గండిపై అధికారులు మంగళవారం భిక్కనూరు మండల కేంద్రానికి విచారణకు వచ్చారు. గత నెల 27న కొందరు దాసనమ్మ చెరువుకు గండి కొట్టారని పలువురు జిల్లా కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించి అధికారులను విచారణ నిమిత్తం భిక్కనూరుకు పంపించారు. వారు చెరువు సమీపంలోని ఇళ్లలో ఉన్న సీసీ పుటేజీలను, గ్రోమోర్ కంపెనీ రిటైల్ దుకాణం సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. అనంతరం సమీపంలో ఉన్న కెనరా బ్యాంక్‌లోకి వెళ్లి మేనేజర్‌తో మాట్లాడారు.

బస్సు సౌకర్యం కల్పించండి



కామారెడ్డి టౌన్: రామారెడ్డి మండలం మోషంపూర్, ఉప్పల్‌వాయి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ దినేష్ కుమార్‌కు ఆ గ్రామాల మహిళలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గతంలో ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సులు వస్తుండేవని, ప్రస్తుతం రావడం లేదని డీఎంకు తెలిపారు. తక్షణమే గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే నిత్యం రెండు సార్లు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ ఉమాదేవి, సరస్వతి, రాజమణి, లక్ష్మి, రజిత, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో తాగునీటికి ఇబ్బందులు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా తాగునీటి సౌకర్యం కల్పించలేదు. ప్రయాణికుల ఇబ్బందులను చూసి సైన్య సేన అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్ మంగళవారం తాగునీటి సౌకర్యం కల్పించారు.

పువ్వుల్లో పుట్టింది ఉయ్యాలో..


కలెక్టరేట్‌లో బతుకమ్మలతో ఉద్యోగులు


బాన్సువాడలోని సాయికీర్తి కళాశాలలో..


పెద్దకొడప్‌గల్‌లో బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న చిన్నారులు


బీర్కూర్‌లో బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు


కంబాపూర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ..


కృష్ణాజీవాడిలో..

సాక్షి నెట్‌వర్క్: పువ్వుల్లో పుట్టింది ఉయ్యాలో.. ముస్తాబు అయ్యింది ఉయ్యాలో.. తొమ్మిది రోజులు ఉయ్యాలో..తంగేడు పూలతో ఉయ్యాలో అంటూ మహిళలు పాటలు పాడి ఆడి హోరెత్తించారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఉద్యోగులు, అంగన్‌వాడీలు, గ్రామాల్లో మహిళలు ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఉంచి సంబురాలు చేసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న నీటి కుండీలు, కుంటలు, చెరువులలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


పెద్దమల్లారెడ్డిలో బతుకమ్మతో చిన్నారి


భిక్కనూరు నగరేశ్వరాలయంలో బతుకమ్మ సంబురాల్లో మహిళలు


జిల్లా కేంద్రంలోని వీక్లీమార్కెట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

గ్రామాభివృద్ధి పనులకు ప్రభుత్వం కృషి

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


బీర్కూర్ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తున్న పోచారం, కాసుల

బాన్సువాడ: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ.66 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా వంటి ఎన్నో పథకాలను అమలు చేసిందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఖలేక్, యామ రాములు, కాంత్‌రెడ్డి, బోయిని శంకర్, శశికాంత్, రఘు, తదితరులున్నారు.

చైతన్య కాలనీ కార్యవర్గం



బాన్సువాడ : పట్టణంలోని చైతన్య కాలనీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సంతోష్‌రెడ్డి, వేద్‌ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా కులకర్ణి రఘు, కోశాధికారిగా నాగార్జున, సహాయ కార్యదర్శిలుగా కొండ విఠల్, లక్ష్మీనారాయణ, రామచంద్రరావు, నాగబాబులతో పాటు సలహాదారులను ఎన్నుకున్నారు. విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు.

రుణాల రికవరీ కోసం స్పెషల్ డ్రైవ్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల వసూళ్ల కోసం ఐకేపీ అధికారులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. జప్తిజాన్కంపల్లి, మాటూర్, ఆత్మకూర్, మాల్తుమ్మెద, తాండూర్ గ్రామాల్లో ఏపీడీ విజయలక్ష్మి, డీపీఎంలు సాయిలు, రాజయ్య మండల ఐకేపీ సిబ్బందితో కలిసి డ్రైవ్ చేపట్టారు. రుణాలకు సంబంధించి రూ.78వేలు వసూలైనట్లు ఏపీఎం రాంనారాయణగౌడ్ తెలిపారు.

సౌరశక్తిపై వినియోగదారులను చైతన్యం చేయాలి


శిక్షణలో పాల్గొన్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

కామారెడ్డి అర్బన్: సౌరశక్తిపై వినియోగదారులను చైతన్యం చేసి ప్రతి ఇంటిపై సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు ప్రోత్సాహించాలని జాతీయ ఇంధన శిక్షణ సంస్థ డైరెక్టర్ బి.వెంకట సుబ్బయ్య అన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద గ్రిడ్ కనెక్టెడ్, రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్‌పై విద్యుత్ ఉద్యోగులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. శిక్షణలో సోలార్ పవర్‌పై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు అధికారులు దుర్గాప్రసాద్, నరేంద్ర కుమార్‌లు తెలిపారు. జిల్లా ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఇంజినీర్లు ప్రభాకర్, స్వామి, కల్యాణ చక్రవర్తి, విజయసారథి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాల ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పాత బాన్సువాడ వాగు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

బాన్సువాడ: బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 25న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ సంబురాల ఏర్పాట్లను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ బతుకమ్మ సంబరాలకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలతో పాటు పలువురు మాజీ మహిళ ఎమ్మెల్యేలు, నాయకులు హాజరుకానున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు జుబేర్, అంజిరెడ్డి, నార్ల రత్నకుమార్, మోచీ గణేష్, రమేష్‌యాదవ్, తదితరులున్నారు.

మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు..

బాన్సువాడ : పట్టణంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశాలు, నిమజ్జనం చేసే వాగులు, కల్కి చెరువు, నాగయ్య చెరువు, పెద్ద వాగు తదితర ప్రాంతాల్లో మొరం వేసి చదును చేశారు. రాత్రి వేళల్లో ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఫరీదుపేట విద్యార్థులు


కబడ్డీ క్రీడాకారులతో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాణాల భాస్కర్‌రెడ్డి

మాచారెడ్డి: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పాల్వంచ మండలం ఫరీదుపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-16 బాలుర, బాలికల విభాగాల్లో హారిక, నితీష్‌కుమార్, అశ్విత, స్పందనలు ఎంపికైనట్టు ఎంఈవో రాంమనోహర్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం క్రీడాకారులను అభినందించారు. రాష్ట్ర స్థాయి క్రీడలు నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో ఈ నెల 25 నుంచి 28 వరకు జరుగుతాయని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

త్రిలింగేశ్వరాలయం పరిశీలన


పరిశీలిస్తున్న ఏపీడీ విజయలక్ష్మి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ శివారులో గల పురాతన త్రిలింగేశ్వరాలయాన్ని మంగళవారం ఏపీడీ విజయలక్ష్మి తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. జిల్లాకలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచనల మేరకు ఆలయాన్ని సందర్శించి పరిశీలించినట్లు ఈ సందర్భంగా ఏపీడీ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆలయం వద్ద ఈ నెలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆమె చెప్పారు. ఈ క్రమంలో ఆలయం వద్ద స్థల పరిశీలన చేసినట్లు పేర్కొన్నారు. డీపీఎంలు సాయిలు, రాజయ్య, ఏపీఎం రాంనారాయణగౌడ్, ఆలయ కమిటీ సభ్యులున్నారు.

సంక్షిప్తం

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణవాడి, నందివాడ గ్రామాలలో మంగళవారం బాధిత కుటుంబాలను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో భూంరావు, సామ రాంరెడ్డి, కృష్ణాగౌడ్, బుచ్చవ్వ, లక్కీ మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి.. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

ఎస్పీఆర్ కాలనీలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని 12వ వార్డు ఎస్పీఆర్ స్వప్నలోక్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు చిన్నోళ్ల రజనీకాంత్‌రావు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్టు కాలనీవాసులు తెలిపారు. మంగళవారం సెంట్రల్ లైటింగ్ పరికరాలు అందజేశారన్నారు. బీజేపీ నాయకులు కె.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



మాచారెడ్డి: జిల్లాలో ఇటీవల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నేత కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. మంగళవారం మాచారెడ్డి మండల కేంద్రంలో మాట్లాడుతూ.. వరద ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించి 20 రోజులవుతున్నా రైతులకు పరిహారం అందలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరద బాధితులను ఆదుకోవాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు వెంకట్, లింబియా, ఎల్లం, నర్సింలు, తదితరులున్నారు.

ఇస్రోజీవాడి దసరా ఉత్సవ కమిటీ ఎన్నిక

కామారెడ్డి రూరల్: ఇస్రోజీవాడి గ్రామ దసరా ఉత్సవ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నాల అనిల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వంగాల విశ్వం, కోశాధికారిగా కంచర్ల శ్రీకాంత్, కార్యదర్శిగా పర్స మహిపాల్, సలహాదారులుగా చెట్కూరి మహిపాల్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవ కమి టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రావణ దహనానికి రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద స్థలాన్ని పరిశీలించారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నేతలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్, నేతలు ఖలీల్, తుకారాం, నౌషానాయక్, లింగురాం పాల్గొన్నారు.